కథా నిలయం
శ్రీకాకుళం

# మామకడుపు చల్లగా

బేరసారాల్లో నేను ఎంత పూరో మా ఆవిడ అంత గైరు. ఈ విషయం మా పెళ్ళయిన పదహార్రోజుల లోపలే అవగతం చేసుకున్నాన్నేను.

ఓ ఆదివారంనాడు దినపత్రిక చదువుతూ కూర్చున్నాను.

సైకిల్‌పైన దుప్పట్లు పెట్టుకుని అమ్మకానికి వచ్చాడొక వ్యాపారి. వంటగదిలో చేస్తున్న పని వదిలేసి వడివడిగా బయటికి వచ్చి అతన్ని పిలిచింది. చాప పరిచింది.

అయిదు నిమిషాల్లో అతగాడు తనదగ్గరున్న దుప్పట్లన్నీ మడతలు విప్పి చాపమీద పరిచాడు.

ఒక్కొక్కదాని విశిష్టతని గురించి చెప్పసాగాడు.

"ఏమండీ..ఇదిగో..ఇది చూడండి... ఎలా వుందీ" అడిగింది ఓ దుప్పటి చేత పుచ్చుకుని.

బాగుందన్నట్లు తలాడించేను.

"ఇది ఎంత చెప్పావ్" అడిగిందతన్ని.

"రెండు వందల యాభై"

"ఏమిటీ..ఈ దుప్పటి రెండు వందల యాభయ్యా" అమితాశ్చర్యం వ్యక్తంచేసింది.

దాని మన్నిక గురించీ, నాణ్యత గురించీ, షాపుల్లో అయితే దాన్ని ఎంతకు అమ్ముతారనే విషయాన్ని విశదపరిచాడు అతగాడు.

"వద్దులే" అంటూ దుప్పటి చాపమీద వదిలేసింది.

అంతగా నచ్చితే తీసుకో... తగ్గిస్తాడ్లే" అన్నాను.

మాట్లాడొద్దు అన్నట్లు గుడ్లు ఉరిమి చూసింది నావైపు.

అదో టెక్నిక్కాబోలనుకుని మిన్నకుండిపోయాన్నేను.

"ఎంతక్కావాలో అడగండమ్మా" అన్నాడు.

"వద్దులే.. అంతంత చెప్తుంటే ఏం అడుగుతాం"

'నాకు గిట్టుబాటయితే ఇస్తా లేకపోతే లేదు. నా ధర నే చెప్పేను. ఎంతక్కావాలో మీరడగండి. తప్పేముంది"

"ఆఁ... అసలంత నాణ్యంగా కూడా లేదులే"

"నాణ్యం గురించి మీకేం అనుమానం వద్దమ్మా. రోజూ ఇటే తిరుగుతుంటాను. అట్టాంటి పొరబాటేం రాదు. గేరెంటీ సరుకు"

"ఎంతకిస్తావో చెప్పు"

"నే చెప్పేగామ్మా...మీరే అడగండి"

'అట్లా కాదులే.. చెప్పు"

"రెండువందల నలభై రూపాయలివ్వండి"

"పదిరూపాయలు తగ్గిస్తున్నావా..."

"మీరడగండమ్మా... ఎందుకు... పదేళ్ళు పనిచేసుద్ది దుప్పటి"

"డెబ్భైకిస్తే రెండు తీసుకుంటాను.."

"ఏందమ్మా... ఒక్కోటి డెబ్భైరూపాయలా? ఏందమ్మా ఆ అడగటం, మాక్కూడా ఆ ధరకు రాలేదమ్మా" అంటూ దుప్పట్లు మడతలు పెట్టుకోసాగేడు.

ఆవిడ అడిగిన ధర వినగానే నాకు మతిపోయింది.

అతడు అనరాని మాటలూ అనేస్తాడేమోనని భయం వేసింది.

అరుపులూ, కేకలూ తప్పవనిపించింది.

"రెండు వందలకు ఇస్తా... తీసుకుంటారా" అన్నాడు పైకిలేస్తూ.

"వద్దులే" అని ఇంట్లోకి వెళ్ళింది సుజాత. దుప్పట్లన్ని రెండు వరుసలుగా పేర్చి తాళ్ళతో కట్టుకున్నాడు. ఒక్కొక్కటి సైకిల్‌మీద పెట్టుకుని తాళ్లతో బిగించాడు.

"జత మూడొందలకిస్తా ఆఖరిమాట..."

... ...

"ఏమ్మా"

"వద్దని చెప్పండి" ఇంట్లోనుంచే నన్ను పురమాయించింది.

నిజం చెప్పొద్దూ... నాకు గొంతు పెగల్లేదు.

"ఏమ్మా... వద్దా" అడిగేడతను.

"వద్దుట్లే బాబూ" అన్నాను వినయంగానూ, భయంగానూ.

అతనేదో గొణుక్కోవటం వినిపించి, విననట్లు పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నాను.

సైకిల్ వెళ్ళిపోయింది.

"వెళ్ళిపోయాడా" అనుకుంటూ చేతిలో అట్లకాడతో సహా వచ్చింది సుజాత.

"వెళ్ళటం కాదు అదృశ్యమైపోయాడు. ఎక్కడ రెండు వందల యాభై.... ఎక్కడ డెబ్బైరూపాయలు" అన్నాను వెటకారంగా.

"మీకు తెలీదు ఊరుకోండి. వీళ్ళని అలాగే అడగాలి. అయినా చూస్తుండండి అయిదు నిమిషాల్లో అతడు మళ్ళీ వస్తాడు.మళ్ళీ ఇంకో ధర చెప్తాడు. వద్దంటాను. నే అడిగినంతకే ఇచ్చి వెళ్తాడు" అని నావైపు చూసి కళ్ళెగరేసి లోనికి నడిచింది.

సరిగ్గా అయిదో నిమిషానికి ఆవిడ చెప్పినట్లే జరిగింది. రెండు దుప్పట్లూ కొనేసింది.

'ఏమంటారూ' అన్నట్లు నొసటితోనే ప్రశ్నించింది.

గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్న నాకు గుటక పడలేదు కొంచెంసేపు.

ఆది మొదలు అగరుబత్తీల దగ్గర్నుంచీ ఆల్విన్ ఫ్రిజ్ వరకూ ప్రతీదీ ఆమె ఆధ్వర్యంలోనే కొనటం చేస్తున్నాను. అయితే ఆడపా దడపా కూరగాయలు మాత్రం నేనే ఒంటరిగా తీసుకురాక తప్పటంలేదు.

* * * *

నా అంతట నేను ఒంటరిగా కూరగాయలు తెచ్చినప్పుడల్లా ఒక్కో రకం ఎంతెంత అని వివరంగా అడుగుతుంటుంది. వినయంగా చెప్తుంటాను. ఇకంతే ఇంటిముందు బండ్లపైన కూరలు అమ్మేవాళ్ళు కిలో ఎంతకు ఇస్తున్నారో, అలాంటప్పుడు మార్కెట్లో ఎంత వుంటుందో క్రితంరోజు పక్కింటి పద్మావతి ఎలా తెచ్చిందో ఓ అరగంట సతాయింపులు, సాధింపులు, వ్యంగ్యాలు వగైరాల్తో ఆ ప్రహసనం పూర్తయిపోతుంది. మరోసారి మళ్ళీ మామూలే.

ఈ తతంగంనుంచి తప్పించుకునేందుకు ఓ తరుణోపాయం ఆలోచించాను. నేను కొన్న ధరకంటే తగ్గించి చెప్పి ఎలాగైనా సరే నేనుకూడా మంచి బేరగాన్నయిపోయానన్న కితాబును శ్రీమతి నుండి పొందాలని నిర్ణయించుకున్నాను. వెంటనే ఆచరణలో పెట్టేను.

కూరగాయలన్నీ కారు చౌక, పిలిచి మరీ ఇస్తున్నారు ఎందుకనో... కిలో వంకాయలు ఆర్రూపాయలయితే రెండనీ, కిలో బెండకాయలు ఎనిమిదయితే మూడని నా నోటికి వచ్చినట్లు చెప్పేశాను.

శ్రీమతి మౌనం నాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. మరో రెండు రకాల కూరగాయలు కూడా పై విధంగానే చెప్పేశాను.

"మీకసలు బుర్ర లేదు" క్లుప్తంగా తిట్టింది.

ఈడ్చి తన్నినట్లనిపించింది నాకు.

బనీను సగం పైకి లాగినవాడ్ని అలానే ఆమె పక్కన చతికిలబడ్డాను.

"ఎందుకని" అన్నాను ఉక్రోషంగా.

"అంత చౌకగా ఉన్నప్పుడు అన్నీ కిలో, కిలో చొప్పున తెచ్చుకోరూ... అరకిలో, పావుకిలో కాకపోతే...మనకి ఫ్రిజ్ వుంది కదండీ"

అయిపోయాన్నేను. సమాధానం లేక మౌనంగా స్నానానికి వెళ్ళిపోయాను. అన్నం వడ్డిస్తూ, పరుపుపైన దుప్పటి మారుస్తూ, వక్కపొడి చేతికి అందిస్తూ నా అజ్ఞానాన్ని అనర్గళంగా విశ్లేషించసాగింది.

"సుజాతా...ఇక ఆపుతావా" అన్నాను. అభ్యర్థనగా.

"ఆపుతాలేండి. ఆపకేంచేస్తాను గానీ అందరూ ఆవకాయ పెట్టేసుకున్నారు. రేపు మామిడికాయలు తీసుకురండి. నేనుకారం, నూనె, పిండి తయారుచేసుకోవాలి. నాకు వెళ్ళేందుకు్కుదరదు" అని పక్కనే పడుకుంది.

... ...

'ఏం మాట్లాడరేంటి" రెట్టించింది.

"ఎన్ని" అడిగేను.

"ఇరవై చాలు. బాగా పుల్లగా వుండాలి. ముక్క కోయించి తిని చూసి మరీ తీసుకురండి" హెచ్చరించింది.

"పోనీ... నువ్వే వెళ్లరాదూ"

"నేనెలా వెళ్ళేదండీ... నాకు ఒంట్లోకూడా బాగాలేదు. అయినా ఇంకా ఎప్పుడు తెల్సుకుంటారు మీరు. తీసుకురండి ధర ఎక్కువైనా మంచివి తీసుకురండి...సరేనా" అంటూ నా గెడ్డంపుచ్చుకుని తనవైపుకు తిప్పుకుంది.

అలాగే అన్నాను ధర విషయం విని కాస్త ధైర్యంగా.

* * * *

మామిడికాయల గోతంతో చేయి పీక్కుపోతుండగా వగర్చుకుంటూ ఇల్లుచేరాను. వరండాలో పక్కింటి పంకజంగారితో ఆవకాయ కబుర్లు చెప్తూ కూర్చున్నది శ్రీమతి. గోతం కిందపెట్టి ఆయాసం తీర్చుకోసాగేన్నేను. ఆత్రంగా గోతం విప్పి మామిడికాయలు బయటకు తీసింది సుజాత.

"కాయలు సైజు, కలర్ మాత్రం బ్రహ్మాండంగా వున్నాయి. పులుపు చూశారా, ఎంతకిచ్చారు, ఎన్ని తెచ్చారు" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

ధర తప్ప అన్నీ కరెక్ట్‌గానే చెప్పేను.

కాయ నాలుగురూపాయలకు కొన్నాను గానీ "డజను పాతిక చొప్పున పాతిక కాయలూ యాభై రూపాయలు" అని అబద్ధం చెప్పేను.

అప్పటికే వంటగదిలోంచి కత్తిపీట తెచ్చి ఓ కాయ తరిగి తనో ముక్కనోట్లో వేసుకుని, పంకజానికి ఓ ముక్క అందించింది.

"అబ్బో అదిరిపోయింది పులుపు. ధరకూడా చాలా చౌక" అన్నది మామిడి పులుపుకు ముఖమంతా అదోలా పెట్టి పంకజం.

"బాగున్నయ్యండీ" మొదటిసారిగా మెచ్చుకున్నది నన్ను సుజాత.

'చాలు. ఈ మాత్రం మెచ్చుకోలు చాలు' మనసులోనే సంతృప్తి చెందేను.

కాయలు కడగటం, తుడవటం ప్రారంభించింది సుజాత.

సహాయం చేస్తున్నది పంకజం.

నేను స్నానానికని బాత్రూంలోకి వెళ్ళాను.

"వదినగారూ, మీరేమీ అనుకోకపోతే రేపు మాక్కూడా ఓ పాతికకాయలు తెచ్చిపెట్టమనండి అన్నయ్యగార్ని. చౌకగా మంచి కాయలు తెచ్చారు" పంకజం మాటలు విన్న నేను విస్తుపోయాను.

అంకగణితం ఆల్జీబ్రాలా నా గుండెలో గాబరా రేపింది.

'అయిపోయింది. కొంప కొల్లేరయింది. రేపు పక్కింటి పంకజం కోసం మరో యాభై రూపాయలు క్షవరం" మనసు అల్లకల్లోలం అయింది. 'ఈ ఉపద్రవం నుండి బయటపడేదెట్లా' ఆలోచనల్లో పడ్డాను.

"సర్లెండి ఆయన ఇవ్వాళ తేవటానికే నన్ను నానా చీవాట్లూ పెట్టేరు. ఇక రేపు మీ క్కూడా తెచ్చిపెట్టమంటే నన్ను నాలుగు కొట్టేయగలరు. అయినా ఆయన రేపూ ఇలాగే తేగలరన్న గ్యారంటీ లేదు. ఏమనుకోవద్దు. ఆయన్ని నమ్ముకోకుండా మీరే ఓపిక చేసుకుంటే మంచిది" అనునయంగా పలికిన సుజాత పలుకులు కర్ణపేయంగా వినిపించినై నాకు.

నా బద్ధకం గురించీ, బుద్ధిమాంద్యం గురించి చెప్తే చెప్పిందిగానీ గండంనుంచి బయటపడేసింది. మనసులోనే శ్రీమతికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నాను.

ఈ సంఘటనతో జీవితంలో మళ్ళీ పరాయివాళ్ళు వుండగా ఇలా ధరల విషయంలో అజాగ్రత్తగా వ్యవహరించకూడదని నిర్ణయించుకున్నాను.

ఆవకాయ పని పూర్తయ్యాక అన్నం వండసాగింది సుజాత.

భోజనాలకి పిల్చేవరకూ వారపత్రికతో కాలక్షేపం చేశాను.

ఎలాగైనా సరే మరో ఘనకార్యం చేసి శ్రీమతి దగ్గర నేనూ మంచి బేరగాడ్నని నిరూపించుకోవాలని తాపత్రయం కలగసాగింది.

అదునుకోసం నిరీక్షించసాగేను.

* * * *

ఆఫీసులో అందరం ఎవరి పనిలో వారం నిమగ్నమై వున్నాము.

చేతిలో సూట్‌కేస్‌తో ఆఫీసులోకి అడుగుపెట్టేడో అపరిచిత వ్యక్తి.

"నమస్కారం సార్" అంటూ సూట్‌కేస్ టేబుల్‌పైన పెట్టేడు.

వివరాలు చెప్తూనే సూట్‌కేస్ తెరిచాడు. అందరికీ తలా ఓ రింగుల జత ప్యాక్ చేసినది అందించాడు ఉచితం అంటూ.

అటుతర్వాత గొలుసులు, గాజులు బయటికి తీశాడు. పది సంవత్సరాలు గ్యారెంటీ అన్నాడు. అడ్రెస్ చెప్పాడు. విజిటింగ్ కార్డులు పంచాడు. నకిలీ నగల నాణ్యత గురించి అనర్గళంగా, ఆకర్షణీయంగా వర్ణించి చెప్పాడు.

మా ఆఫీస్‌లో ఉన్న అరడజనుమంది ఆడవాళ్ళూ వాటిని అలా చూసీ, చూడంగానే పెదవి విరిచి వెళ్ళిపోయారు.

అతగాడి మాటలకు మైమరచిపోయిన మగవాళ్ళం మాత్రం ఎవరికి తోచిన వస్తువులు వాళ్లం కొనేశాం తలా ఓ మూడువందలు ఇచ్చేసి, బిల్లులు వ్రాసిచ్చాడు. గాజులు సైజు మార్చుకోవాల్సిన అవసరం ఉంటే మళ్ళీ మూడురోజుల్లో వస్తానన్నాడు. నేను మాత్రం మా ఆవిడకు తీసుకున్న గాజుల సైజు మార్చుకోనక్కర్లేదని చెప్పేశాను.

అయిదుగంటల వరకూ ఆఫీసులో వుండటం కష్టమనిపించింది. ఎప్పుడెప్పుడు సుజాతకు గాజులు చూపి ఆమెను ఆనందింపచేద్దామా అని మనసు ఆరాటపడుతున్నది. ఎంతైనా ఆడవాళ్ళన్నాక ఆభరణాలపైన మోజుండటం సహజంకదా. పైగా ధర విషయంలో నలుగురితోపాటు నారాయణలా నేను కొనేశాను కాబట్టి ఈసారి సుజాత నాకు క్లాసులు తీసుకునే అవకాశం లేదు.

ఇన్నాళ్ళకి నూటికి నూరు మార్కులు సంపాయించుకునే అవకాశం వచ్చినందుకు ఉబ్బితబ్బిబ్బవుతూ ఇల్లు చేరేను.

పనిమనిషి అంట్లు తోముతున్నది. తలుపులన్నీ దగ్గరకు వేసి ఉన్నాయి. సుజాత ఇంట్లో లేదు. ఒక్కసారిగా నా ఉత్సాహం నీరు కారింది. డ్రెస్ మార్చుకుని ఆమెకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

అరగంట తర్వాత వచ్చింది సుజాత.

కావాలనే కళ్ళుమూసుకుని కూర్చుని కోపం నటించాను.

"ఎంతసేపయిందండీ వచ్చి... ముందరే వచ్చేశారేం" అడిగింది.

"ఎక్కడికి వెళ్ళావ్"

"సావిత్రి వాళ్లింటికి వెళ్ళొస్తున్నా. మీకు చాలా చెప్పాలి. ముందు కాఫీ తెస్తానుండండి" అని నాకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వంటగదిలోకి నడిచిందామె.

కాఫీ కప్పు అందిస్తూ "ఇవ్వాళ ఓ గొప్ప పనిచేశానండీ" అంటూ నా పక్కనే కూర్చుంది.

"ఏమిటది"

పక్కనే ఉన్న టేబుల్ సొరుగులాగి ఓ ప్యాకెట్ బయటకు తీసింది.

అదిచూడగానే నా పై ప్రాణాలు పైనే పోయినై.

"ఇవిగోండి...ఎలా వున్నయ్యో చూడండి"అంటూ నాలుగు గాజులు నాకు అందించింది.

యాంత్రికంగా అందుకున్నాను.

"ఎంత" అన్నాను భయంగా, దీనంగా కూడా.

"ఎలా వున్నయ్ చెప్పండి ముందూ"

"బాగున్నయ్...ఎంత" అన్నాను ఆదుర్దాగా.

"జత యాభై రూపాయలండీ. వంద రూపాయలకి నాలుగు. అందరూ తీసుకుంటుంటే బాగున్నయ్యని నేనూ తీసుకున్నాను. పది సంవత్సరాలు గ్యారెంటీ అన్నాడు. ఇంకా గొలుసులూ గట్రాకూడా ఉన్నయ్ అతని దగ్గర.." చెప్తూనే ఉన్నది సుజాత.

నాకు ఒక్క మాటా సరిగా వినబడటంలేదు. వినపడినా అర్థం కావటంలేదు. గుండెల్లో దడ, అసహనం, ఆవేశం, అన్నీ ఒక్కసారే కలిగిన వింత అనుభూతి.

సరిగ్గా అదే సమయంలో మెరుపులా వచ్చిన ఆలోచనకు అకస్మాత్తుగా నా ముఖంలో వెలుగు, పెదవులపైన చిరుదరహాసం, గర్వం, ఠీవి, దర్పం వగైరా... వగైరా చోటు చేసుకున్నయ్.

"నీ మీద నీకు నమ్మకం ఎక్కువైపోయింది. డబ్బంటే లెక్క లేకుండా పోయింది. నకిలీ నగకోసం వంద రూపాయలు తగలేశావ్. వాడుచెప్పిన కల్లబొల్లి మాటలకు బోల్తా పడ్డావ్" మండి పడ్డాను.

అనుకోని పరిణామానికి, అనుభవంలో లేని నా ప్రవర్తనకు విస్తుపోయింది సుజాత.

"ఏంటలా అంటున్నారు" కొంచెం భయంగానే అన్నది.

... ...

అందరూ తీసుకుంటుంటేనూ..." నసిగింది.

బెడ్‌రూంలోకి వెళ్లి నా బ్యాగ్ తెరిచి నాలుగు గాజులు తెచ్చి ఆమె చేతిలో పెట్టేను.

విస్మయంగా నా వంకా, నగల వంకా మార్చి మార్చి చూడసాగింది.

"అతను మా ఆఫీసుక్కూడా వచ్చాడు. మీకు చెప్పినట్లే అన్నీ చెప్పాడు. జత పదిహేనుకయితే తీసుకుంటాం, లేకపోతే వెళ్ళిపొమ్మన్నాం. చచ్చినట్లు ఇచ్చాడు నాలుగ్గాజులూ నలభై చేసి"

"నలభైకా"ఆశ్చర్యపోయింది సుజాత.

"నేనొక్కడ్నే కాదు పదిహేనుమందిమి తీసుకున్నాం"

"అయ్యో...మేమింకా చాలా చౌకగా కొనేశాం అనుకుంటున్నామండీ, అనవసరంగా అరవై రూపాయలు వాడి ముఖాన పోశాం..." నొచ్చు కోసాగిందామె.

"సర్సరే... అయిందేదో అయిపోయింది. పొరబాటు ఎవరికైనా జరుగుతుంటయ్. పోతే పోయినై గానీ ఇంకెప్పుడూ ఇలాంటి పన్లు చేసి మోసపోకు" హెచ్చరింపుగా అన్నాను.

బిక్క ముఖం వేసుకుని కూర్చుండిపోయింది.

ఆమెను చూస్తే జాలేసిందిగానీ ఏమాత్రం జారిపోయినా చక్కటి అవకాశం చేజారిపోతుందని గాంభీర్యం సడలకుండా జాగ్రత్తపడ్డాను.

స్నానానికి వెళ్ళాను.

అటువంటి సువర్ణావకాశం సద్వినియోగం చేసుకున్న సంబరంలో మునిగి తేలుతున్న నాకు మా కొలీగ్ పార్థసారథి గొంతు అశనిపాతంలా వినపడింది.

అయిపోయింది.

అంతా అయిపోయింది.

అంతవరకూ అల్లుకుంటూ వచ్చిన అబద్ధాల పొదరిల్లు కుప్ప కూలిపోయింది.

నేను సరిగ్గా బాత్రూం తలుపు తీసేసరికి సారథి –

"వందకే మీరు నష్టం అనుకుంటే ఇక తలా మూడొందలు పోసి కొన్న మేం ఏమనుకోవాలమ్మా" అనటం.

"మూడొందలా" అని అర్ధాంగి ఆశ్చర్యపోవటం నా చెవిన పడినై.

అంతే. అడుగు ముందుకు పడలేదు. ఒంటికి చుట్టుకున్న టవల్తోనే అట్నుంచి అటు వీధిలోకి పరిగెత్తుదామన్న ఆలోచనని అణుచుకుని ధైర్యం కూడగట్టుకుని, తలవంచుకుని హాల్లోకి అడుగుపెట్టేను.

సుజాత వంక చూసే సాహసం చేయలేదు నేను.

సారథి మళ్ళీ గాజుల గలగలలు మొదలెడ్తాడని అతడడిగిన పుస్తకం తెచ్చి చేతిలో పెట్టాను. ఎలాగో వెంటనే వెళ్ళిపోయాడు.

గువ్వలా గదిలో ఒదిగి కూర్చున్నాను. తలుపు దగ్గర నించున్న సుజాత తాండవం ప్రారంభించబోతున్నదనుకున్నాను...కానీ...

"ఏమండీ... ఒక్క ప్రశ్న అడుగుతాను... నిజం చెప్పండి" నా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"ఏమిటి" అన్నాను బెదురుగా.

"మన పెళ్ళికి మీ వాళ్ళు కట్నం ఎంతడిగేరు"

"ఆ సంగతి ఇప్పుడెందుకు సుజాతా" దీనంగా అడిగేను.

"కావాలి చెప్పండి"

"పాతికవేలేగా"

"అయితే మానాన్న కూడా మీ తరహా మనిషే"

"అంటే"

"మీవాళ్ళు నలభై వేలడిగితే బేరమాడి పాతికవేలకి కుదిర్చానని చెప్పాడు. నాకు తెలుసుంటే అయిదువేలకి ఖరారు చేసుకునేదాన్ని" అని గల గల నవ్వింది సుజాత.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

◆ స్వాతి ◆